క్లుప్తంగా

ప్రజావాణి సమస్యలకు సత్వర పరిష్కారం


వార్డులో పర్యటిస్తున్న కమిషనర్ చిరంజీవి

జగిత్యాలటౌన్: ప్రజావాణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని బల్దియా కమిషనర్ చిరంజీవి అన్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని 5,9 వార్డుల్లో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాగునీరు,డ్రెయినేజీ సమస్యలపై సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వార్డు ప్రజలు వినతిపత్రం అందజేయగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా సమస్యలను పరిశీలించినట్లు తెలిపారు. త్వరగా తాగునీటి సరఫరాతో పాటు డ్రెయినేజీ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజినీర్ చరణ్, శానిటరీ ఇన్స్పెక్టర్లు మారుతి, రాము, జవాన్ జాఫర్ తదితరులు ఉన్నారు.

నృసింహుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు


శేషవస్త్రం, ప్రసాదాలు ఇస్తున్న అధికారులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో మంగళవారం ప్రముఖులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్, కామినేని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శశిధర్‌లు కుటుంబ సమేతంగా స్వామివార్లను దర్శించుకున్నారు. శశిధర్ నిత్యాన్నదానం కోసం రూ.లక్ష విరాళం అందజేశారు. వారికి దేవస్థానం పక్షాన ఈవో శ్రీనివాస్ చైర్మన్ జక్కు రవీందర్‌లు స్వామివారి శేషవస్త్రం, చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు.

చట్టాలపై మహిళలకు అవగాహన


మాట్లాడుతున్న శారద

జగిత్యాలరూరల్: మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో మహిళాసంఘాల పాత్ర కీలకమని జిల్లా లీడ్ బ్యాంక్ కౌన్సిలర్ మధుసూదన్ అన్నారు. జగిత్యాల మండల ఐకేపీ కార్యాలయంలో గ్రామ సమైక్య అసిస్టెంట్లు, అధ్యక్షులకు మానవ అక్రమ రవాణా, లైంగికవ్యాపారం, సైబర్ ఆధారిత రవాణా నుంచి ఎలా బయట పడాలి..? మోసపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..? అలాంటి నేరాలకు ఎలాంటి చట్టాలున్నాయి..? అన అంశంపై అవగాహన కల్పించారు. సఖీ సెంటర్ జిల్లా సహాయకురాలు శారద, డీపీఎం వనజ, ఏపీఎం గంగాధర్, భాగ్యలక్ష్మీ, సీసీలు మహిళలు పాల్గొన్నారు.

వేసవిలో కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలి


ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న కమిషనర్

మెట్‌పల్లి: వేసవిలో పారిశుధ్య కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ మోహన్ సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు వాణి కార్మికులకు పరీక్షలు జరిపి వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం కమిషనర్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణు, ముజీబ్, పవన్, అనూష, శారద, లాస్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐ పాఠాలు ప్రారంభం

సారంగాపూర్: ఏఐ విద్యాబోధన (కృత్రిమ) ద్వారా ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని ఎంఈవో బి.కిషోర్ అన్నారు. మండలంలోని రంగపేట ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఏఐ విద్యాబోధన ప్రారంభించారు.కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

ట్రిపుల్ రైడ్‌పై కొరడా

- పరిమితికి మించి ద్విచక్ర వాహనాలపై ప్రయాణం
- మృత్యువాత పడుతున్న యువకులు
- ఈ ఏడాది ఇప్పటికే 430 కేసులు నమోదు


← ట్రిబుల్ రైడ్ వెళ్తున్న యువకులు

జగిత్యాలక్రైం: జిల్లాలో నిత్యం పదుల సంఖ్యలో యువత ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. ‘టు వీలర్ ఫర్ టు ఓన్లీ’ అని మోటారు వాహన చట్టం స్పష్టం చేస్తున్న ఈ విషయం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ ద్విచక్ర వాహనంపై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించడం యువకులకు జల్సాగా మారింది. దీంతో అధునాతన ద్విచక్రవాహనాలను కొనుగోలు చేసి ధరూర్, చల్‌గల్ బైపాస్‌రోడ్‌తో పాటు, జగిత్యాల జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్, గొల్లపల్లి, ధర్మపురి రోడ్లలో యువకులు ట్రిపుల్ రైడింగ్‌తో హంగామా సృష్టిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లాలో 2022లో 3226 కేసులు నమోదు కాగా, 2023లో 1466, 2024లో 1684, 2025లో ఇప్పటి వరకు 430 కేసులు నమోదయ్యాయి.

వాహనం అదుపు చేయడం అసాధ్యం..

టూ వీలర్‌పై ఇద్దరు మాత్రమే ప్రయాణించాలి. కానీ యువకులు నిబంధనలు పాటించకుండా ముగ్గురు, లేదా నలుగురు ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. టూ వీలర్‌పై పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కినప్పుడు దాని కెపాసిటీ తగ్గుతుంది. సాధారణంగా గంటకు 60 కిమీ వేగంతో దూసుకుపోయే వాహనం ఇలాంటప్పుడు 40 కిమీ మించదు. ఈ ప్రభావం ఓవర్ టేకింగ్ సమయాల్లో ప్రమాదాలు జరిగి, చాలా మంది యువకులు ప్రాణాలు కోల్పోతున్నారు.

బ్యాలెన్సింగ్ కెపాసిటీ..

ఏదైనా వాహనం ప్రమాదానికి లోనుకాకుండా ఉండాలంటే బ్రేక్, బ్యాలెన్సింగ్ ఈ రెండూ అత్యంత కీలకం. సరైన సమయానికి బ్రేక్ వేయగలగటం, అవసరమైన స్థాయిలో బ్యాలెన్స్ చేసుకోవడం తప్పనిసరి. ట్రిపుల్ అయితే రైడింగ్‌లో ఈ ప్రభావం ఈ రెండు కెపాసిటీల పైనా పడి ఎదురుగా వచ్చే వాహనాన్ని గుర్తించినా ప్రమాదాన్ని ఆపలేరు.

కఠిన చర్యలు తీసుకుంటున్నం



డ్రంకెన్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపటం, మైనర్ డ్రైవింగ్ మాదిరిగా ట్రిపుల్ రైడింగ్‌పై కఠిన చర్యలు చేపడుతున్నాం. ఇప్పటివరకు జరిమానా మాత్రమే విధిస్తున్నాం. త్వరలో కోర్టుల్లోనూ చార్జీషీట్‌లు దాఖలు చేస్తాం. ఎందరో తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్న ట్రిపుల్ రైడింగ్‌ను అదుపు చేయడానికి యువకుల తల్లిదండ్రులు, కుటుంబీకుల సహకారం ఎంతో అవసరం.

మల్లేశం, ట్రాఫిక్ ఎస్సై

అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాల: అన్ని వర్గాల సంక్షేమాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆదేశాల మేరకు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని, నిరుద్యోగులకు ఉద్యోగాలు, బీసీలకు అండగా ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు గిరి నాగభూషణం, మోర హన్మండ్లు, శ్రీనివాస్, రాజిరెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ట్రేడ్‌లైసెన్స్ ఫీజులు వెంటనే చెల్లించాలి

జగిత్యాల: పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రులకు ట్రేడ్ లైసెన్స్ ఆన్‌లైన్ ద్వారా పొందారని, కానీ వాటిని రెన్యూవల్ కాకుండా అలాగే ఆస్పత్రిని నిర్వహిస్తున్నారని, వెంటనే ట్రేడ్‌లైసెన్స్ ఫీజు చెల్లించాలని కమిషనర్ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ, కొందరు లైసెన్స్ పొందినప్పటికీ రెన్యువల్ చేయించుకోవడం లేదని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొందరు ఆన్‌లైన్‌లో ట్రేడ్ లైసెన్స్ పొందినప్పటికీ ఆన్‌లైన్‌లో తప్పుడు సమాచారం ఇస్తే 25 రెట్ల జరిమానా విధిస్తామని తెలిపారు. మూడు రోజుల్లో ఆలిండియా మెడికల్ అసోసియేషన్ సభ్యత్వం గల ప్రైవేట్ ఆస్పత్రులు నిర్వహిస్తున్న వారు ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు.

వైభవంగా లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు


హోమంలో పాల్గొన్న భక్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామ శివారులోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బుధవారం రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు.

అడవిలో అగ్గి రాజేస్తే కఠిన చర్యలు


కాలిన చెట్లను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

సారంగాపూర్: అడవుల్లో అగ్గి రాజేసి నష్టం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ రేంజర్ రవికుమార్ అన్నారు. మంగళవారం సారంగాపూర్ అటవీప్రాంతంలో మంటలు చెలరేగి రైతుల మామిడి తోటలోకి విస్తరించి మామిడి తోట కాలిపోగా కాలిన అటవీప్రాంతంతో పాటు, కాలిన తోటలను ఆయన పరిశీలించారు. ఈ సంవత్సరం ఫైర్‌లైన్స్ ఏర్పాటుకు అనుమతి లేకపోవడంతో ఫైర్ లైన్స్ ఏర్పాటు చేయలేకపోయామని, అయినప్పటికి అడవుల్లో మంటలు రాకుండా బీట్ అధికారులు, బేస్‌క్యాంపు సభ్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. కలప దొంగలపై కూడ పూర్తి నిఘా పెట్టామని అడవులను నరికినా, వన్యప్రాణులను వేటాడిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట బీట్ అధికారి గోపాల్ ఉన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


ఎరువుల దుకాణం ప్రారంభిస్తున్న పీడీ, మహిళలు

మల్యాల: ప్రభుత్వం అందించే ప్రోత్సాహం, పథకాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని డీఆర్డీవో పీడీ రఘువరన్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఎరువుల దుకాణాన్ని పీడీ ప్రారంభించి మాట్లాడారు. మహిళా సభ్యులకు ఎరువులను బహిరంగ మార్కెట్ ధరకన్నా తక్కువ ధరకు పొందే అవకాశం ఉందన్నారు. మహిళా సంఘాల్లోని వ్యవసాయదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో ఏడీ చరణ్‌దాస్, ఎంపీడీవో స్వాతి, తహసీల్దార్ మునీందర్, డీపీఎం వెంకటేశ్, విజయభారతి, ఏపీఎం రాజయ్య, హుస్సేన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు అంజలి, శ్రీధరణి ఎఫ్‌పీవో అధ్యక్షురాలు మానస, శ్రీధర్, కృష్ణమోహన్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగాలకు పేర్లు నమోదు చేసుకోవాలి

జగిత్యాలటౌన్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టాంకాం) ఆధ్వర్యంలో యూఏఈలో ఉద్యోగ ఖాళీల భర్తీకి ఈనెల 20న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బింగి సత్యమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు ఈనెల 20 గురువారం ఉదయం 10.30 మధ్యాహ్నం 2గంటల లోపు సమీకృత జిల్లా కార్యాలయంలోని ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో జరిగే ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు హాజరు కావాల్సిందిగా కోరారు. వివరాలకు 9440051452, 9440049861 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చిలుకవాడకు చెందిన అల్లకొండ రాజవ్వ (70) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. చిలుకవాడకు చెందిన రాజవ్వ ఈనెల 10 న అర్ధరాత్రి మోతె రోడ్‌లో వెళ్తుండగా అదే కాలనీకి చెందిన తొగిటి సాయి వివేక్ కారు అతివేగంగా నడిపి ఢీకొనగా రాజవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందింది. మృతురాలి కుమారుడు అల్లకొండ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సాయివివేక్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై గీత తెలిపారు.

తుమ్మల చెరువులో గుర్తు తెలియని మృతదేహం

మల్యాల: మండలంలోని ముత్యంపేటలో తుమ్మల చెరువులో గుర్తు తెలియని శవం లభ్యమైనట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. ముత్యంపేటలోని తుమ్మలచెరువు వద్ద గ ఒడ్డెలో కుళ్లిపోయిన దశలో ఉన్న సుమారు వయసు (45) గల గుర్తు తెలియని పురుషుడి మృతదేహాన్ని మంగళవారం ముత్యంపేట కారోబార్ పైడిపల్లి రాజేశ్వర్‌రావు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్సై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్: అసెంబ్లీలో బీసీ బిల్లు ఆమోదం పొందడంపై మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం సంబరాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, పీసీసీ మెంబర్ తొట్ల అంజయ్య, ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, డైరెక్టర్లు ఎం.డీ హఫీజ్, కారపు గంగాధర్, వాకిటి రాజారెడ్డి, వంగ మహేశ్, జవ్వాజి చౌదరి, కూన మోహన్ పాల్గొన్నారు.

మేడిపల్లి: అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ 42 శాతం తీర్మానం చేయడంపై మేడిపల్లి, భీమారం మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. రానున్న రోజుల్లో బీసీలకు చట్టసభల్లో అధిక శాతం అవకాశాలు కల్పించాలని తీర్మానించినట్లు తెలిపారు, కార్యక్రమంలో ఏనుగు రమేశ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుందారపు జలందర్, మాదం వినోద్, చేపూరి నాగరాజు, శ్రీపతి దామోదర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం చరితాత్మకం

జగిత్యాలటౌన్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం చరితాత్మక నిర్ణయం తీసుకుందని టీబీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ప్రశంసించారు. మంగళవారం టీబీసీ జేఏసీ భవన్‌లో మాట్లాడారు. కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొండ లక్ష్మణ్, కార్యదర్శి శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి బండారి విజయ్, వెల్మల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మల్యాల: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించాలని, ప్రస్తుత ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో వర్గీకరణ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తాలో రెండో రోజు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు ప్రస్తుతం చేపడుతున్న ప్రభుత్వ నియామకాల్లోనే అమలు చేయాలని,కోరారు. . కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నలువాల సంజీవ్, బెజ్జంకి బుజ్జయ్య, ముప్పారపు రవీందర్, గుడిసె రవి, మోత్కు నర్సయ్య, టైటస్ పాల్గొన్నారు.

- **విద్యార్థులకు వైద్య పరీక్షలు**

జగిత్యాలరూరల్: మండలంలోని సంగంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జగిత్యాల ఐఎంఏ ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ కోటగిరి సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేశారు. బాలికల్లో రక్తహీనత సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్త్రీల వైద్య నిపుణురాలు కోటగిరి స్వరూప, పిల్లల వైద్య నిపుణులు కల్లెం దీపక్‌రెడ్డి, హెచ్‌ఎం పడాల రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **పెండింగ్ బిల్లులు చెల్లించాలి**

వెల్గటూర్ : గత ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలని కోరుతూ వెల్గటూర్ ఎంపీడీవో కార్యాలయం ముందు మంగళవారం మాజీ సర్పంచులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పులు చేసి తాము అభివృద్ధి పనులు చేసి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు., ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మారం జలంధర్ రెడ్డి, కొమ్ము రాంబాబు, బాలసాని రవి తదితరులు పాల్గొన్నారు.

- **రాయితీపై వ్యవసాయ పరికరాలు**

పెగడపల్లి: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ ఉప పథకం కింద మహిళా రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పరికరాలు అందజేస్తుందని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. సన్న, చిన్నకారు మహిళా రైతులకు 40 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు 50 శాతం రాయితీపై బ్యాటరీస్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, డ్రోన్, రోటోవేటర్, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్, కల్టివేటర్, బండ్ ఫార్మర్, పవర్ వీడర్, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్, ట్రాక్టర్లు, స్ట్రా బాలర్స్ అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళా రైతులు ఈ నెల 25లోగా మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్ 7288894129లో సంప్రదించాలని ఆయన సూచించారు.

- **జమిలీ ఎన్నికలతో దేశానికి మేలు**

మల్యాల: జమిలీ ఎన్నికలతో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని, ఎన్నికల వ్యయం తగ్గుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు వాసాల రమేశ్ అన్నారు. మండలంలోని మద్దుట్లలో జమిలీ ఎన్నికలపై మండల కన్వీనర్ బొబ్బిలి వెంకటస్వామి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జమిలి ఎన్నికలతో దేశం సుస్థిరంగా ఉండడంతోపాటు ఆర్థిక సంస్కరణలు పటిష్టంగా అమలు చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, మండలాధ్యక్షుడు గాజుల మల్లేశం, కెల్లెటి రమేశ్, సంగని రవి,, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

- **అసెంబ్లీ ముట్టడికి రైతులు తరలి రావాలి**

మెట్‌పల్లి: రైతాంగం సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 24న చేపడుతున్న అసెంబ్లీ ముట్టడికి రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని రైతు ఐక్యవేదిక నాయకులు కోరారు. పట్టణంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం పసుపు రైతులతో వారు సమావేశమై మాట్లాడారు. పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, రుణమాఫీ, రైతు భరోసాలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నల్ల రమేశ్ రెడ్డి, పన్నాల తిరుపతిరెడ్డి, మామిడి నారాయణరెడ్డి, పాపన్న, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్వీ నాయకుల ముందస్తు అరెస్టు

మల్లాపూర్: బీఆర్‌ఎస్వీ నాయకులను ప్రభుత్వం పోలీసులతో ముందస్తు అరెస్టు చేయించడం తీవ్ర గర్హనీయమని బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ నాయకుడు బైరి రవికుమార్‌యాదవ్ అన్నారు. అసెంబ్లీ ముట్టడికి తరలివెళ్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులను అదుపులోకి తీసుకుని ముందస్తు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు కాటిపెల్లి వినోద్ పాల్గొన్నారు.

పెగడపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు ..

పెగడపల్లి: మండలంలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులను స్థానిక పోలీసులు మంగళవారం ముందస్తుగా అరెస్టు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు నాయకులు తరలివెళ్లకుంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మాజీ సర్పంచి లక్ష్మణ్, రాజరాంపల్లి మాజీ ఉప సర్పంచ్ రాజశేఖర్‌గౌడ్, శ్రీనివాస్, మల్లేశం, ఆనందం, మనోహర్ అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో మంగళవారం రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ మల్లారెడ్డి, లైన్‌మెన్ లక్ష్మణ్, అన్‌మ్యాన్ తిరుపతి, ప్రజాప్రతినిధులు జక్కుల చంద్రశేఖర్, గుర్రం మహేందర్, మహేశ్వర్‌రావు పాల్గొన్నారు.

- **ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పట్ల హర్షం**

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించటం పట్ల తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎస్సీ 59 కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరణ చేసి అసెంబ్లీలో బిల్లుకు చట్ట బద్ధత కల్పించటం రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.

- **యూత్ పార్లమెంట్ రాష్ట్రస్థాయి ఎంపిక కార్యక్రమం**

జగిత్యాల: వికసిత్ యూత్ పార్లమెంట్ మెగా ఈవెంట్ రాష్ట్రస్థాయి ఎంపిక కోసం ఎస్‌కేఎన్ఆర్ కళాశాలలో మార్చి 20 నుంచి 21 తేదీల్లో సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు చైర్మన్ అశోక్ తెలిపారు.యూత్ పార్లమెంట్ కోసం జగిత్యాల జిల్లా నోడల్ జిల్లాగా ఎంపికైందని, ఇక్కడ జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మిగతా వివరాలకు కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ 94906 83621 సంప్రదించాలన్నారు.

- **పందులను తరలించాలి**

జగిత్యాల: జిల్లా కేంద్రంలో పందులు విచ్చలవిడిగా వదిలిపెట్టడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, యజమానులకు నోటీసులు జారీ చేయడం జరిగిందని కమిషనర్ చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని, కొన్ని సమయంల్లో ప్రజలపై సైతం దాడులు చేస్తున్నాయని, సెక్షన్‌ను అనుసరించి జంతువుల నియంత్రణ, న్యూసెన్స్ నిరోధించడంలో భాగంగా నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

బుగ్గారం: విద్యార్థులు చదువులో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలవాలని బుగ్గారం మండల ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. గొప్ప గొప్ప లక్ష్యాలను ఏర్పరచుకొని వాటికనుగుణంగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. ఈ మేరకు బుగ్గారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరై ప్రసంగించారు. విద్యార్థులు టెన్షన్ పడకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బాలికల ఉన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న బాలికలు

‘పది’లో వంద శాతం ఫలితాలు సాధించాలి

కోరుట్ల: పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాధికారి కే. రాము హాజరై మాట్లాడారు. పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో ఎంఈవో గంగుల నరేశం, అమ్మ ఆదర్శపాఠశాల చైర్‌పర్సన్ అంజమ్మ, హెచ్‌ఎం కృష్ణ మోహన్ రావు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు పార్టీ

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట జెడ్పీ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు పార్టీ మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా వేడుకలు ఏర్పాటు చేశారు. ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నల్ల రాజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా తిరు కల్యాణ వేడుకలు


తాళిబొట్టు చూపుతున్న అర్చకులు

కోరుట్ల: పట్టణంలోని శ్రీ అష్ట లక్ష్మీ సహిత శ్రీ లక్ష్మీనారాయణ స్వామి 17వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మంగళవారం అష్టోత్తర శత కలశములచే ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీ అష్ట లక్ష్మీ సహిత శ్రీమన్నారాయణ స్వామి తిరు కల్యానోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బూరుగు రామస్వామి గౌడ్, అర్చకులు, తదితరులుపాల్గొన్నారు.